సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

గురువారం । 17 । అక్టోబర్ । 2024



ఆర్టీసీకి దండిగా ఆదాయం

దసరా పండుగ ఆర్టీసీకి అదనపు ఆదాయం తెచ్చిపెట్టింది. ప్రయాణికుల రాకపోకలతో మంచి రాబడి సమకూరింది. 8లో



ముగిసిన కోటమైసమ్మ జాతర

కారేపల్లి మండలం ఉసిరికాయలపల్లిలో కోట మైసమ్మ జాతర ముగిసింది. వేలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. 8లో

వాతావరణం

గరిష్ఠం / కనిష్ఠం
33° / 25°

జిల్లాలో గురువారం సాధారణ ఉష్ణోగ్రత నమోదవుతుంది. కొన్ని ప్రాంతాల్లో ఓ మోస్తరు వర్షం పడే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

పెద్దమ్మతల్లి ఆలయంలో నేడు చండీహోమం

పాల్వంచరూరల్: పౌర్ణమి సందర్భంగా మండలంలోని కేశవాపురం – జగన్నాథపురం మధ్య కొలువైన శ్రీకనకదుర్గ (పెద్దమ్మతల్లి) ఆలయం యాగశాలలో గురువారం చండీహోమం నిర్వహించనున్నట్లు ఈఓ ఎస్.రజనీకుమారి తెలిపారు. పూజలో పాల్గొనాలనుకునే భక్తులు రూ.2,516 చెల్లించి గోత్రనామాలు నమోదు చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాలకు 63034 08458 నంబర్‌లో సంప్రదించాలని ఆమె తెలిపారు.

కొలువులో చేరిన కొత్త టీచర్లు



కొత్తగూడెం ఎంఈఓకు రిపోర్ట్ చేస్తున్న ఉపాధ్యాయులు

కొత్తగూడెంఅర్బన్: డీఎస్సీ – 2024లో ఎంపికైన నూతన ఉపాధ్యాయులు జిల్లాలోని ఎంఈఓల వద్ద బుధవారం రిపోర్ట్ చేసి, ఉద్యోగాల్లో చేరారు. మంగళవారం రాత్రి వరకు వారికి అధికారులు కౌన్సెలింగ్ నిర్వహించి పాఠశాలలు కేటాయించారు. వారు విధుల్లో చేరినప్పటికీ.. రాష్ట్ర విద్యాశాఖ ఆదేశాల మేరకు త్వరలో శిక్షణ ఇవ్వనున్నారు.

రేపు ఉమ్మడి జిల్లాస్థాయి టేబుల్ టెన్నిస్ ఎంపికలు

కొత్తగూడెంఅర్బన్: ఉమ్మడి ఖమ్మం జిల్లా పాఠశాలల అండర్ –17 బాలబాలికల టేబుల్ టెన్నిస్ ఎంపికలు ఈనెల 18వ తేదీన ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో జరుగుతాయని జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.వెంకటేశ్వరాచారి తెలిపారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆరో తరగతి నుంచి ఇంటర్ వరకు చదివిన వారు ఈ ఎంపికలకు అర్హులని పేర్కొన్నారు. ఉమ్మడి జిల్లాలో ఉన్న వ్యాయామ ఉపాధ్యాయులు, పీడీలు నియమ నిబంధనలు పాటిస్తూ క్రీడాకారులు సకాలంలో హాజరయ్యేలా చూడాలని కోరారు. పూర్తి వివరాలకు ఖమ్మం జిల్లా పాఠశాలల క్రీడా కార్యదర్శులు వాసిరెడ్డి నరేష్ కుమార్, నర్సింహమూర్తిని సంప్రదించాలని సూచించారు.

నేడు, రేపు డిగ్రీ కళాశాలల స్థాయి క్రికెట్ టోర్నీ

ఖమ్మంస్పోర్ట్స్: కాకతీయ యూనివర్సిటీ ఆధ్వర్యాన ఈనెల 17, 18వ తేదీల్లో ఖమ్మం జోన్ (ఉమ్మడి జిల్లా స్థాయి) క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ బి.వెంకన్న తెలిపారు. ఖమ్మం ఎస్ఆర్ అండ్ బీజీఎన్ఆర్ కళాశాల మైదానంలో జరిగే పోటీలకు జట్లు ఉదయం 8గంటలకల్లా చేరుకోవాలని సూచించారు. క్రీడాకారులు విధిగా ఎలిజిబులిటీ ఫామ్, కళాశాల గుర్తింపు కార్డు, ఎస్సెస్సీ మెమో జిరాక్స్ తీసుకురావాలని, వివరాలకు 944123 6384 నంబర్‌లో సంప్రదించాలని తెలిపారు.

జిల్లా సంక్షేమాధికారిగా స్వర్ణలత



బాధ్యతలు స్వీకరిస్తున్న స్వర్ణలత

కొత్తగూడెంఅర్బన్: జిల్లా సంక్షేమ శాఖ అధికారిణిగా స్వరలతా లెనినా బుధవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో పని చేసిన విజేత ఖమ్మం జిల్లాకు బదిలీ కావడంతో ఆమె స్థానంలో స్వర్ణలత ఇక్కడికి వచ్చారు. స్వర్ణలతకు గతంలో కూడా జిల్లాలో పని చేసిన అనుభవం ఉంది.

18, 19 తేదీల్లో జిల్లా స్థాయి క్రీడాపోటీలు

పాల్వంచరూరల్ : కిన్నెరసానిలోని గిరిజన క్రీడా పాఠశాలలో ఈనెల 18, 19 తేదీల్లో భద్రాచలం ఐటీడీఏ పరిధిలోని గిరిజన పాఠశాలల విద్యార్థులకు జిల్లా స్థాయి పోటీలు నిర్వహించనున్నట్లు ఐటీడీఏ క్రీడా శాఖాధికారి బి.గోపాల్‌రావు తెలిపారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. వచ్చే నెలలో రాష్ట్రస్థాయి క్రీడోత్సవాలు జరుగనున్న నేపథ్యంలో స్థానిక ఐటీడీఏ స్థాయిలోని ఏడు డివిజన్ల విద్యార్థులకు పోటీలు ఏర్పాటు చేసినట్లు వివరించారు. వాలీబాల్, ఖోఖో, కబడ్డీ, ఆర్చరీ, అథ్లెటిక్స్, చదరంగం తదితర క్రీడాంశాల్లో బాలబాలికలకు వేర్వేరుగా జూనియర్, సీనియర్ విభాగాల్లో పోటీలు నిర్వహిస్తామని తెలిపారు.

ఖాకీలపై శీతకన్ను !



జిల్లా పోలీసులపై రాష్ట్ర ప్రభుత్వం శీతకన్ను వేసిందా అంటే అవుననే సమాధానమే వస్తోంది. ఖాకీ సిబ్బందితో నిత్యం బండెడు చాకిరీ చేయించుకుంటూ ఆ పనికి దక్కాల్సిన ప్రతిఫలం వారికి ముట్టజెప్పేందుకు మాత్రం సర్కారుకు మనసొప్పడం లేదు. రాష్ట్రంలోని ఇతర జిల్లాల పోలీసులకు అడ్డంకిగా నిలవని ఆర్థిక సమస్యలు కేవలం ఈ జిల్లా పోలీసులకే మోకాలడ్డుతున్నాయి. ఇందులో పరమార్థం ఏంటో ప్రభుత్వ పెద్దలకు, ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచి కేబినెట్‌కు ప్రాతినిథ్యం వహిస్తున్న ముగ్గురు మంత్రులకే తెలియాలి. – సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం

జిల్లా పోలీసులకు పుట్టెడు చాకిరీ.. బండెడు బకాయిలు

- ఏడాది పొడవునా రేయింబవళ్లు విధుల్లోనే..
- పేరుకుపోయిన సరెండర్ లీవ్స్, డీఏ తదితర బిల్లులు
- గణేష్ నిమజ్జన డ్యూటీ టీఏ, డీఏ చెల్లింపుల్లోనూ ఆలస్యమే
- ఈ జిల్లాకే అడ్డంకిగా నిలుస్తున్న రాష్ట్ర ఆర్థిక ఇబ్బందులు !

బకాయిలు చెల్లించరేం..?

విధి నిర్వహణలో భాగంగా వీక్లీ ఆఫ్‌లు, పండుగ రోజుల్లో కూడా పోలీసులు రాత్రీ పగలు తేడా లేకుండా పని చేస్తుంటారు. ఇలా పని చేసిన రోజులను సరెండర్ లీవ్‌లుగా పరిగణించి.. ఆరు నెలలకు ఒకసారి సదరు ఉద్యోగి నెల జీతం బేసిక్ మొత్తానికి సమానంగా చెల్లించాలి. ఇలా ప్రతీ ఉద్యోగికి ఏడాదికి సగటున రెండుసార్లు సరెండర్ లీవ్‌ల మొత్తాన్ని చెల్లించాల్సి ఉంటుంది. అయితే గత ఐదేళ్లుగా ఈ లీవ్‌లకు సంబంధించిన బకాయిలను ప్రభుత్వం మంజూరు చేయడం లేదు. దీంతో ఇవి కొండలా పేరుకుపోయాయి. కొత్తగా చేరిన ఉద్యోగి మొదలు సీనియర్ వరకు పరిగణనలోకి తీసుకుంటే సరెండర్ లీవ్‌ల బకాయిల కనిష్ట మొత్తం రూ.1.50 లక్షల నుంచి రూ. 5 లక్షలకు పైగానే ఉన్నాయి. గత 34 నెలలుగా ట్రావెలింగ్ అలవెన్సులు, నాలుగు డీఏలు కూడా బకాయిలే ఉన్నాయి. ఆఖరికి ఇటీవల గణేష్ నిమజ్జనం సందర్భంగా హైదరాబాద్‌లో డ్యూటీలు వేసిన సిబ్బందికి కూడా టీఏ, డీఏ చెల్లించకపోవడం గమనార్హం.

బండెడు చాకిరీ..

రాష్ట్రంలోని ఇతర జిల్లాల పోలీసులతో పోల్చితే మావోయిస్టు ప్రభావిత ప్రాంతంగా పేరున్న భద్రాద్రి జిల్లా పోలీసులకే పని ఎక్కువ. అర్ధరాత్రి అపరాత్రి అని తేడా లేకుండా విధుల్లోకి వెళ్లాల్సి వస్తుంది. వానాకాలంలో గోదావరి వరదలు, శీతాకాలంలో ముక్కోటి, వేసవికాలంలో శ్రీరామనవమితో పాటు వీఐపీల పర్యటనల సందర్భంగా ఇక్కడి పోలీసులు శ్రమించి పని చేస్తున్నారు. జిల్లాలో నెలకొన్న పరిశ్రమలకు అసాంఘిక శక్తుల నుంచి ఇబ్బందులు రాకుండా విధులు నిర్వహిస్తున్నారు. ఇక్కడ పెట్టుబడులకు లా అండ్ ఆర్డర్ పరంగా సమస్యలు లేని వాతావారణం సృష్టించారు. ఇంతగా చెమటోడ్చుతున్నా వారికి దక్కాల్సిన ప్రతిఫలం విషయంలో మాత్రం ప్రభుత్వం నిర్లక్ష వైఖరి ప్రదర్శిస్తూనే ఉంది.

ఎండనక..వాననక..

ఎవరైనా కేబినెట్ ర్యాంక్ స్థాయి వ్యక్తి పినపాక పర్యటనకు వస్తే పాల్వంచ దగ్గర కిన్నెరసాని నది దాటింది మొదలు పినపాక వరకు సుమారు 50 కిలోమీటర్ల మేర అడుగడుగునా కానిస్టేబుళ్లు, హోంగార్డులు కాపలాగా ఉంటారు. మంత్రులు రావడానికి ముందు నుంచి తిరిగి సురక్షితంగా వారి ప్రాంతాలకు వెళ్లే వరకు ఇలా ఎండలో, వానలో, అడవుల్లో బందోబస్తు డ్యూటీ చేస్తున్నారు. ఇంతలా పని చేస్తున్న ఈ జిల్లాకు చెందిన పోలీసులకు బకాయిలు మంజూరు చేయించే విషయంపై ప్రభుత్వ పెద్దలు కిమ్మనడం లేదు.

అన్నీ సమస్యలే..

ఏళ్ల తరబడి లక్షల రూపాయలు బకాయిలుగా పేరుకుపోవడంతో పండగ వచ్చినా, ఇంట్లో ఎవరైనా అనారోగ్యం పాలైనా, శుభకార్యం చేయాల్సి వచ్చినా కానిస్టేబుల్ నుంచి ఏఎస్ఐ, ఎస్ఐ స్థాయి ఉద్యోగుల వరకు జేబులు తడుముకోవాల్సిన పరిస్థితి నెలకొంది. అప్పుల కోసం తిరగాల్సిన దుస్థితి ఎదురవుతోంది. ఈ ఆర్థిక ఇబ్బందులు, బకాయిల అంశంపై ఎవరైనా పోలీసుల వాట్సాప్ గ్రూపులు, అంతర్గత సమావేశాల్లో కనీస స్థాయిలో మాట్లాడినా 'నిఘా'ను ఎదుర్కొవాల్సి వస్తోందని కొందరు ఖాకీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. క్రమశిక్షణ విషయంలో కట్టుదిట్టంగా ఉండటం పోలీసు శాఖకు తప్పనిసరి. దీనిపై మరో ప్రశ్నకు తావు లేదు. అయితే ఏళ్ల తరబడి బకాయిలు చెల్లించకుండా సిబ్బందిని ఆర్థిక ఇబ్బందుల్లోకి నెట్టడం సరికాదనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది.

ఇక్కడే ఇబ్బందులు ఎందుకు.?

పొరుగున ఉన్న ఖమ్మం, ములుగు, మహబూబాబాద్ జిల్లా పోలీసులకు ఈ బకాయిల్లో సగానికి పైగా, కొన్ని పూర్తిగా చెల్లించారు. కేవలం ఆర్థిక ఇబ్బందులను సాకుగా చూపుతూ భద్రాద్రి జిల్లా సిబ్బందికే ఏళ్ల తరబడి పెండింగ్‌లో పెడుతుండడం తీవ్ర విమర్శలకు తావిస్తోంది. ఈ అంశంపై కొత్తగూడెం పర్యటన సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డికి, పలు సందర్భాల్లో మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డికి వినతిపత్రాలు ఇచ్చినా ఆశించిన ఫలితం దక్కలేదు. ఇటీవల డిప్యూటీ సీఎం, ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క దృష్టికి ఈ అంశాన్ని తీసుకెళ్తే దసరా పండుగకు కొన్ని బకాయిలు అందజేస్తామని హామీ ఇచ్చినా చివరకు మొండిచేయే ఎదురైంది.

కమనీయం.. రామయ్య నిత్యకల్యాణం



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి నిత్యకల్యాణ వేడుక బుధవారం కమనీయంగా సాగింది. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామి వారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామి వారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు.

నేడు శబరి స్మృతి యాత్ర..

దేవస్థానం ఆధ్వర్యంలో గురువారం శబరి స్మృతి యాత్ర జరగనుంది. ఈ మేరకు ఆలయ అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఉదయం గిరిజన సంప్రదాయ నృత్యాలతో గిరి ప్రదక్షిణ, అనంతరం ఆలయంలో శబరికి ఫల, పుష్పాంజలి, స్వామి వారికి కల్యాణోత్సవం నిర్వహిస్తారు. అశ్వారావుపేట మండలం వినాయకపురం గ్రామంలో ముత్యాలమ్మ తల్లి ఆలయంలో దేవస్థానం ప్రచార రథం ద్వారా స్వామి వారిని తోడ్కొని వెళ్లి గిరిజనుల చెంతన సీతారాముల కల్యాణం జరపనున్నారు. ఈ కార్యక్రమానికి గిరిజనులు, భక్తులు పెద్ద ఎత్తున తరలిరావాలని ఈఓ రమాదేవి కోరారు.

పోషణ లోపంపై దృష్టి పెట్టండి

- అంగన్‌వాడీ కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు కల్పించాలి
- కలెక్టర్ జితేష్ వి పాటిల్ ఆదేశం



మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్

సూపర్‌బజార్(కొత్తగూడెం): అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారుల్లో పోషణ లోపం గల వారిని గుర్తించి, వారు సాధారణ స్థితికి వచ్చేలా దృష్టి సారించాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ ఐసీడీఎస్ అధికారులను ఆదేశించారు. జిల్లా మహిళా, శిశు, దివ్యాంగుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ చేపడుతున్న కార్యక్రమాలు, చైల్డ్ ప్రొటెక్షన్, అడాప్షన్, చైల్డ్ హెల్ప్‌లైన్ తదితర అంశాలపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలో తాగునీరు, విద్యుత్, మరుగుదొడ్లు తదితర కనీస సౌకర్యాలు కల్పించాలని సూచించారు. జిల్లాలోని అన్ని కేంద్రాల ప్రాంగణాల్లో మునగ, కరివేపాకు, ఉసిరి, చింత, వెలగ మొక్కలు నాటాలని ఆదేశించారు. ఈ మొక్కల ద్వారా విటమిన్ ఏ, సీ, డీతో పాటు కాల్షియం లభిస్తాయని, తద్వారా పిల్లలు ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. జిల్లాలో అద్దె భవనాల్లో కొనసాగుతున్న అంగన్‌వాడీ కేంద్రాలు, స్థలం వివరాలు అందజేయాలని సీడీపీఓలకు సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాలు, ఐసీడీఎస్ కార్యాలయాల నిర్మాణానికి త్వరలో స్థలం కేటాయిస్తామని అన్నారు. జిల్లాలో బాల కార్మికుల నిర్మూలన, బాలల భిక్షాటన, బాల్య వివాహాల నిర్మూలనకు అందరూ సమన్వయంగా పనిచేయాలని, భద్రాద్రిని బాలల స్నేహపూరిత జిల్లాగా మార్చాలని అన్నారు. ఆయా అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో పిల్లలు, గర్భిణులు ఎంతమంది ఉన్నారనే వివరాలను నిర్దేశిత పట్టిక రూపంలో నమోదు చేయాలని చెప్పారు. దీంతో వారి ఆరోగ్య స్థితిగతులను ఎప్పటికప్పుడు తెలుసుకునే అవకాశం ఉంటుందని వివరించారు. సమావేశంలో జిల్లా సంక్షేమాధికారి స్వర్ణలత లెనినా, ప్రాజెక్ట్ సీడీపీఓలు, సీడబ్ల్యూసీ మెంబర్లు తదితరులు పాల్గొన్నారు.

19న దిశ కమిటీ సమావేశం

కలెక్టరేట్‌లో ఈ నెల 19న మధ్యాహ్నం0 3 గంటలకు దిశ కమిటీ సమావేశం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ జితేష్ వి పాటిల్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మహబూబాబాద్ పార్లమెంట్ సభ్యులు పోరిక బలరాం నాయక్ అధ్యక్షతన జరుగనున్న ఈ సమావేశానికి కో చైర్మన్, ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురాంరెడ్డి, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, దిశ కమిటీ సభ్యులు, అన్ని శాఖల అధికారులు హాజరవుతారని వివరించారు. అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు తాము చేపట్టిన పనులపై ప్రగతి నివేదికలతో రావాలని సూచించారు. కాగా, కలెక్టరేట్‌లో గురువారం ఉదయం 10.30 గంటలకు వాల్మీకి జయంతి వేడుకలను నిర్వహించనున్నట్లు కలెక్టర్ పాటిల్ తెలిపారు.

ఎట్టకేలకు వీకే-7 ఓసీకి పచ్చజెండా!



వీకే-7 షాఫ్ట్ ముఖద్వారం

- తొలి దశ అనుమతులు జారీ
- మరో రెండు నెలల్లో స్టేజ్ - 2 అనుమతులు కూడా...
- సాకారం కానున్న ఏరియా కార్మికుల కల

సింగరేణి(కొత్తగూడెం): మూడేళ్లుగా ఎదురుచూస్తున్న సింగరేణి కొత్తగూడెం ఏరియా పరిధిలోని వీకే-7 ఓపెన్ కాస్ట్ గనికి తొలి దశ (స్టేజ్-1) అనుమతులు లభించాయి. గత నెల 28వ తేదీన జరిగిన ఫారెస్ట్ అడ్వైజరీ కమిటీ సమావేశంలో పచ్చజెండా ఊపగా.. ఇందుకు సంబంధించిన పత్రాలు కూడా ఏరియా అధికారులకు వారం కిందట అందాయి. మరో మూడు నెలల్లో స్టేజ్-2 అనుమతులు కూడా వస్తే రానున్న ఆర్థిక సంవత్సరం (2025-26)లో కొత్తగూడెం ఏరియాలో సుమారు 5 మిలియన్ టన్నుల ఉత్పత్తి అదనంగా నమోదవుతుంది. అటవీ అడ్వైజరీ కమిటీ అధికారులకు ఇక్కడి బొగ్గు లభ్యత, పర్యావరణ పరిరక్షణకు తీసుకోనున్న చర్యలపై అన్ని పత్రాలు సమర్పించడమే కాక పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించడంతో స్టేజ్-1 అనుమతులు లభించాయని భావిస్తున్నారు. ఇదే జోరులో స్టేజ్-2 అనుమతులు సైతం లభిస్తే ఓసీలో ఓబీ పనులు మొదలు పెట్టి, ఫిబ్రవరి – మార్చి కల్లా బొగ్గు ఉత్పత్తి చేయాలని అధికారులు భావిస్తున్నారు.

5 మిలియన్ టన్నుల ఉత్పత్తి

సింగరేణి సంస్థ ఈ ఆర్థిక సంవత్సరం 72 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి చేయాలని లక్ష్యంగా నిర్దేశించుకుంది. ఇందుకోసం పెండింగ్ ఉన్న గనుల అనుమతులు సాధించేందుకు కృషి చేస్తోంది. ఇందులో భాగంగానే వీకే-7 ఓసీకి అనుమతులు సాధించగలిగారు. అయితే, స్టేజ్-2 అనుమతుల కోసం కేంద్ర మంత్రిత్వ శాఖలు విధించిన షరతులకు లోబడి ఆఫ్ లోడింగ్, ఓసీలో హాల్‌రోడ్లు తదితర పనులను పూర్తి చేయాల్సి ఉంటుంది. తద్వారా అనుమతి లభించి రానున్న ఆర్థిక సంవత్సరంలోనైనా ఈ గని ద్వారా సుమారు 5 మిలియన్ టన్నుల ఉత్పత్తి సాధించవచ్చని చెబుతున్నారు. దీనికి తోడు ఒడిశాలోని నైనీ బ్లాక్‌లో ఆరు మిలియన్ టన్నులు తోడైతే లక్ష్యసాధన సులువవుతుంది.

ఓబీ టెండర్లు ఖరారు

వీకే-7 ఓసీకి గతేడాదే అనుమతి వస్తుందనే అంచనాతో యాజమాన్యం రెండేళ్ల కిందటే ఓబీ టెండర్లు ఖరారు చేసింది. అయితే, ఇప్పటివరకు పనులు మొదలు కాకపోవడంతో టెండర్ పొందిన కాంట్రాక్టర్లు యాజమాన్యంపై ఒత్తిడి పెంచుతున్నారు. అనుమతులు రాకముందే టెండర్లు ఎలా కట్టబెట్టారని ప్రశ్నిస్తున్న వారు మూడేళ్ల పాటు తామేమి చేయాలని ప్రశ్నిస్తునట్లు తెలిసింది.

అటవీ అనుమతులే తరువాయి

సుమారు 1,114 హెక్టార్ల విస్తీర్ణంలో ఏర్పాటయ్యే వీకే-7 ఓసీలో దాదాపు 190 మిలియన్ టన్నుల బొగ్గు నిక్షేపాలు ఉన్నట్లు అంచనా. దాదాపు 35 ఏళ్ల జీవితకాలం ఉంటుందని.. సుమారు వెయ్యి మందికి ఉపాధి లభిస్తుందని చెబుతున్నారు. అయితే, ఈ గనికి 773 హెక్టార్లలో అటవీ భూమి అవసరమవుతోంది. సింగరేణి ఆధీనంలో 341 హెక్టార్ల స్థలం వివిధ కాలనీల రూపంలో ఉండగా.. అక్కడి ప్రజలకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ సిద్ధం చేశారు. అలాగే, ప్రైవేట్ భూముల సమస్య కూడా పరిష్కారమైనా అటవీ భూమి అనుమతులే జటిలంగా మారాయి. అటవీ భూమికి ప్రత్యామ్నాయంగా మరోచోట భూమి కేటాయించినా సానుకూల స్పందన రాలేదని సమాచారం.

అంతా సవ్యంగా సాగితే..



వీకే-7 భూగర్భ గని మూతపడటంతో మూడేళ్లుగా ఏరియాలో ఉత్పత్తి కొంత తగ్గుముఖం పట్టింది. ప్రస్తుతం ఓసీ ఏర్పాటుకు స్టేజ్-1 అనుమతులు రావడం ఆనందంగా ఉంది. అయితే, స్టేజ్-2 అనుమతులకు సంబంధించి అవాంతరాలను అధిగమించాలి. రాష్ట్ర ప్రభుత్వం మాదిరిగా కేంద్ర ప్రభుత్వం కూడా స్పందించి అంతా సవ్యంగా సాగితే త్వరలోనే అనుమతులు లభిస్తాయనే నమ్మకం ఉంది.

–శాలేంరాజు, కొత్తగూడెం ఏరియా జీఎం

పరిహారానికి ని'బంధనాలు'

- కొండంత నష్టానికి గోరంత సాయం
- భారీ వర్షాలకు వేల ఎకరాల్లో దెబ్బతిన్న పంటలు
- తీవ్రంగా నష్టపోయిన రైతులు
- 33 శాతం నిబంధనతో అందరినీ పరిగణనలోకి తీసుకోని వైనం



పినపాక మండలంలో పంట నష్టం సర్వే చేస్తున్న వ్యవసాయాధికారులు (ఫైల్)

సూపర్‌బజార్(కొత్తగూడెం): జిల్లాలో ఇటీవల కురిసిన భారీ వర్షాలు, గోదావరి, కిన్నెరసాని వరదలతో పంటలు నీట మునిగి రైతులు తీవ్రంగా నష్టపోయారు. పలుచోట్ల ఇసుక, మట్టి మేటలు వేశాయి. చేతికందే దశలో ఉన్న పెసర, మరో నెల రోజుల్లో దిగుబడి రావాల్సిన పత్తి, అప్పుడప్పుడే ఎదుగుతున్న వరి.. ఇలా అనేక పంటలు వరదల పాలయ్యాయి. జిల్లా వ్యాప్తంగా 5వేల ఎకరాలకు పైగానే పంటలు దెబ్బతిన్నాయని రైతులు, రైతు సంఘాల నేతలు చెబుతున్నారు. కానీ అధికారులు మాత్రం 33 శాతం మేర పంటలకు నష్టం వాటిల్లితేనే పరిహారం వర్తిస్తుందని అంటున్నారు. జిల్లాలో సర్వే చేసి 2,148 మంది రైతులకు చెందిన 2,656.15 ఎకరాల్లోనే పంటలు దెబ్బతిన్నాయని గుర్తించారు. ఈ మేరకు ప్రభుత్వానికి నివేదిక అందించగా ఎకరానికి రూ.10 వేల చొప్పున రూ. 2,65,63,750 పరిహారం విడుదల చేశారు.

ఇవేం లెక్కలు..?

జిల్లాలో భారీగా పంట నష్టం జరిగినా నిబంధనల పేరుతో తక్కువ ఎకరాల్లోనే పంటలు దెబ్బతిన్నట్లు సర్వేలో తేల్చడం సరైంది కాదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నష్టపోయిన ప్రతీ రైతుకు పరిహారం అందించాలే తప్ప నిబంధనల పేరిట ఇబ్బందులు పెట్టడం సరి కాదని, ఎంతమేర పంట నష్టం జరిగితే దానికి అనుగుణంగా పరిహారం అందించాలని రైతు సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు. అయితే ప్రకృతి వైపరీత్యాలతో పంటలకు నష్టం వాటిల్లితే 33 శాతం కంటే ఎక్కువగా నష్టపోయినప్పుడే పరిహారం అందుతుందని ప్రభుత్వ నిబంధనలు చెబుతున్నాయి. ఈ విధానంతో చిన్న, సన్నకారు రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని, ఈ లెక్కలు సరికావని రైతు సంఘాలు విమర్శిస్తున్నాయి.

కౌలు రైతుల పరిస్థితి దారుణం..

ఇటీవలి వరదలు, వర్షాలు కౌలు రైతులను మరింతగా కుంగదీశాయి. భూమి కౌలుకు తీసుకున్నప్పుడు యజమానితో ఎకరాకు ఇంత అని ఒప్పందం చేసుకుంటారు. ఇందులో కొంత మొత్తం ముందుగానే చెల్లించాలి. కౌలు చెల్లించి, పంటలకు పెట్టుబడి పెట్టి సాగు చేస్తే సర్వం వర్షార్పణం అయింది. దీంతో వారు రెండు విధాలా నష్టపోయారు. ప్రభుత్వం నిబంధనలను సడలించి తమకు న్యాయం చేయాలని వారు కోరుతున్నారు. ఇక ఇసుక మేటలు వేసిన భూముల్లో అధికారులు సర్వే చేయలేదు. వాటిని తొలగించే ఖర్చు తాము భరించలేమని, ప్రభుత్వమే ఈ మేరకు చర్యలు చేపట్టాలని పలువురు రైతులు ప్రజావాణిలో కూడా వినతులు సమర్పించారు. ఇప్పటికైనా ప్రభుత్వం పునరాలోచించి తమకు న్యాయం చేయాలని వారు వేడుకుంటున్నారు.

నిబంధనల ప్రకారమే సర్వే



ప్రభుత్వ నిబంధనల ప్రకారమే పంట నష్టం సర్వేను క్షేత్ర స్థాయిలో నిర్వహించాం. భారీ వర్షాలకు దెబ్బతిన్న పంటల వివరాలను కలెక్టర్ ద్వారా ప్రభుత్వానికి నివేదించాం. ఆ మేరకు నిధులు మంజూరయ్యాయి.

– వి.బాబూరావు, జిల్లా వ్యవసాయాధికారి

ఏటా నష్టపోతున్నాం..



ప్రకృతి వైపరీత్యాలతో పంటలు దెబ్బతిన్న మాకు ఎంత నష్టం జరిగితే అంత పరిహారం ఇవ్వాలి. అంతే తప్ప 33 శాతం నిబంధన విధించడం సరైంది కాదు. ప్రతి సంవత్సరం ఏదో ఒక రూపంలో పంటలు నష్టపోతూనే ఉన్నాం. అయినా సర్కారు సాయం అందడం లేదు.

– కల్తీ ముత్తయ్య, కన్నాయిగూడెం, గుండాల మండలం

వైద్య కళాశాలలో 19 వరకు అడ్మిషన్లు



ఎంబీబీఎస్ సీటు కోసం ధ్రువపత్రాలు సమర్పిస్తున్న విద్యార్థిని

కొత్తగూడెంరూరల్: జిల్లా వైద్య కళాశాలలో నూతన అడ్మిషన్లు జరుగుతున్నాయని, ఈనెల 19 వరకు ఈ ప్రక్రియ కొనసాగుతుందని ప్రిన్సిపాల్ రాజకుమార్ తెలిపారు. ఇందులో లోకల్(రాష్ట్ర) సీట్లు 128 కాగా ఇప్పటివరకు 120 మంది అడిష్మన్లు పొందారని, మరో 8 మంది చేరాల్సి ఉందని పేర్కొన్నారు. ఇక ఆలిండియా స్థాయి సీట్లు 22కు గాను ముగ్గురు మాత్రమే చేరారని, ఇంకా 19 మంది ప్రవేశాలు పొందాల్సి ఉందని రాజకుమార్ వివరించారు.

క్లుప్తంగా

సింగరేణి ఉద్యోగికి రజత పతకం

సింగరేణి(కొత్తగూడెం): ఉత్తరాఖండ్ రాష్ట్రంలోని డెహ్రాడూన్‌లో జరుగుతున్న ఆలిండియా పబ్లిక్ సెక్టార్ అథ్లెటిక్స్ మీట్‌లో బుధవారం జరిగిన షాట్‌పుట్ పోటీల్లో సెక్టార్ విభాగంలో సింగరేణి ఉద్యోగిని కే.మాన్విత రజత పతకం కైవసం చేసుకున్నారు. కార్పొరేట్ ఎస్టేట్ విభాగంలో విధులు నిర్వర్తిస్తున్న మాన్విత గతంలో కోలిండియాస్థాయి పోటీల్లో కూడా విజేతగా నిలిచారు. ఈ సందర్భంగా ఆమెను డైరెక్టర్లు అభినందించారు.

నేటి నుంచి ఆయిల్‌పామ్ గెలల సేకరణ నిలిపివేత

అశ్వారావుపేటరూరల్: అశ్వారావుపేట పామాయిల్ ఫ్యాక్టరీలో వార్షిక నిర్వహణ నేపథ్యంలో గురువారం నుంచి ఆయిల్‌పామ్ గెలల సేకరణ నిలిపివేస్తున్నట్లు ఆయిల్‌ఫెడ్ డివిజనల్ మేనేజర్ ఆకుల బాలకృష్ణ తెలిపారు. ప్రస్తుతం గెలలు తక్కువగా వస్తున్న కారణంగా సేకరణ నిలిపి వేశామని, గురువారం నుంచి రైతులు దమ్మపేట మండలం అప్పారావుపేటలోని పామాయిల్ ఫ్యాక్టరీకి తరలించాలని సూచించారు. కాగా, ఈ ఏడాది జనవరిలోనే ఫ్యాక్టరీ నిర్వహణ పేరుతో గెలల సేకరణ నిలిపివేయగా, మళ్లీ ఇప్పుడు నిలిపివేయడాన్ని రైతులు తప్పుపడుతున్నారు. టన్ను, అరటన్ను దిగుబడి వచ్చే సమయంలో అప్పారావుపేట ఫ్యాక్టరీకి వెళ్లేందుకు ఇబ్బంది అవుతుందని చెబుతున్నారు. అశ్వారావుపేట ఫ్యాక్టరీ వద్ద అధికారులే గెలలు సేకరించి అప్పారావుపేట ఫ్యాక్టరీకు తరలించాలని డిమాండ్ చేస్తున్నారు.

సీతారామ కాలువల్లో మొసళ్ల సంచారం

బూర్గంపాడు: సీతారామ ప్రాజెక్ట్ కాలువల్లో మొసళ్ల సంచారంతో పరిసర గ్రామాల ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. కృష్ణసాగర్ నుంచి పినపాక పట్టీనగర్ గ్రామాల మధ్యన ఉన్న సీతారామ ప్రాజెక్ట్ కాలువల్లో మొసళ్లు సంచరిస్తుండగా, స్థానికులు గమనించి అటవీ శాఖ అధికారులకు సమాచారమిచ్చారు. అటవీశాఖ అధికారులు కూడా మొసళ్ల సంచారాన్ని నిర్ధారించారు. సీతారామ కాలువ పరిసరాలలోకి పశువులను, జీవాలను నీళ్ల కోసం, మేత కోసం తోలుకెళ్లవద్దని అధికారులు సూచిస్తున్నారు. పశువుల కాపరులు అప్రమత్తంగా ఉండాలని కోరారు.

గుండెపోటుతో ఏఆర్ కానిస్టేబుల్ మృతి

కొత్తగూడెంఅర్బన్: గుండెపోటుతో ఏఆర్ కానిస్టేబుల్ శివప్రసాద్(58) బుధవారం మృతి చెందాడు. త్రీటౌన్ పోలీసుల కథనం ప్రకారం .. పట్టణ పరిధిలోని బూడిదగడ్డ ఏరియాకు చెందిన శివప్రసాద్, లక్ష్మీదేవిపల్లిలోని శ్రీరామచంద్ర కళాశాలలోని ఈవీఎం మిషన్ల గోదాం వద్ద గార్డ్ ఇన్‌చార్జ్‌గా పని చేస్తున్నాడు. గుండెపోటు రావడంతో అక్కడ ఉన్నవారు గమనించి ఆస్పత్రికి తరలించారు. అప్పటికే శివప్రసాద్ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి...

దుమ్ముగూడెం : మండలంలోని సీతారాంపురం గ్రామంలో ఉన్న ఏకలవ్య పాఠశాల దగ్గర పని చేస్తున్న బిహార్ రాష్ట్రానికి చెందిన వికాస్‌కుమార్ (27) బుధవారం విద్యుదాఘాతంతో మృతి చెందాడు. పాఠశాల దగ్గర విధులు నిర్వహిస్తున్న వికాస్ విద్యుత్ షాక్‌కు గురి కాగా, భద్రాచలంలోని ఓ ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందాడని తెలిపారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. భవన నిర్మాణదారుల నిర్లక్ష్యం వల్లే విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడని, మృతుని కుటుంబానికి న్యాయం చేయాలని సీపీఐ నాయకుడు బోల్లోజు వేణు డిమాండ్ చేశారు. ఈ ఘటనపై పోలీసులు వివరాలు సేకరించి మృతదేహాన్ని భద్రాచలం ఏరియా వైద్యశాలలోని మార్చురీలో భద్రపరిచారు.

మట్టి ట్రాక్టర్లు, జేసీబీ స్వాధీనం

టేకులపల్లి: అనుమతులు లేకుండా మట్టి తవ్వకాలు చేసి రవాణా చేస్తున్న ట్రాక్టర్లను టేకులపల్లి పోలీసులు బుధవారం పట్టుకున్నారు. టేకులపల్లి ఎస్‌ఐ పి.సురేష్ కథనం ప్రకారం.. మండలంలోని ఆంజనేయపాలెం వద్ద ఉన్న ఓ గుట్టపై అనుమతులు లేకుండా అక్రమంగా మట్టి తవ్వకాలు చేసి రవాణా చేస్తున్నారనే ఫిర్యాదు రావడంతో పోలీసులు, రెవెన్యూ అధికారులు సంయుక్తంగా సంఘటనా స్థలానికి వెళ్లి తవ్వకాలను నిలిపివేశారు. మట్టి తవ్వుతున్న జేసీబీ, రవాణా చేస్తున్న నాలుగు ట్రాక్టర్లను పోలీసుస్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

యూట్యూబ్ చానల్‌కు చెందిన ముగ్గురి అరెస్ట్

ఖమ్మంక్రైం: ఖమ్మంలోని ఓ ప్రముఖ ఆస్పత్రిపై కల్పిత వార్త రూపొందించడమే కాక ప్రసారం చేయకుండా ఆపాలంటే రూ.5 లక్షలు ఇవ్వాలని బెదిరించిన యూట్యూబ్ చానల్‌కు చెందిన ముగ్గురిని ఖమ్మం వన్‌టౌన్ పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. సీఐ ఉదయ్‌కుమార్ తెలిపిన వివరాలు.. యూట్యూబ్ చానల్ సీఈఓ పుచ్చకాయల ప్రకాష్, బ్యూరో చీఫ్ అత్తలూరి రామకృష్ణ అలియాస్ రాంకీ, అసిస్టెంట్ కెమెరామెన్ షేక్‌బాబా ఇటీవల నిజాంపేట ప్రాంతంలోని ఓ ప్రముఖ ఆస్పత్రికి వెళ్లి ఏటా తమకు రూ.5 లక్షల యాడ్ ఇవ్వాలని బెదిరించారు. లేనిపక్షంలో ఆస్పత్రిపై రూపొందించిన కథనాన్ని చానల్‌లో అప్‌లోడ్ చేస్తామనడంతో యాజమాన్యం పోలీసులను ఆశ్రయించింది. దీంతో ముగ్గురిపై దోపిడీ కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

ఆర్టీసీకి దండిగా ఆదాయం

15రోజుల్లో రూ.10.51కోట్ల రాక
- జిల్లాలో మొదటి స్థానంలో భద్రాచలం డిపో
- సిబ్బందిలో జోష్ నింపిన విజయదశమి


కొత్తగూడెం బస్టాండ్‌లో ప్రయాణికుల సందడి

చుంచుపల్లి: బతుకమ్మ, విజయదశమి పండుగలు ఈసారి కూడా ఆర్టీసీకి అదనపు ఆదాయాన్ని తెచ్చిపెట్టాయి. ప్రయాణికులు ఆర్టీసీని ఆదరించటంతో జిల్లాలోని నాలుగు డిపోలకు రెండు వారాలపాటు ఆదాయం సమకూరింది. ఆర్టీసీ అధికారులు బతుకమ్మ, దసరా పండుగల సందర్భంగా ఈ నెల 1 నుంచి 15వ తేదీ వరకు ప్రత్యేక బస్సులు నడిపారు. జిల్లాలోని కొత్తగూడెం, భద్రాచలం, మణుగూరు, ఇల్లెందు డిపోల నుంచి 274 ప్రత్యేక సర్వీసులను హైదరాబాద్‌తోపాటు ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడ తదితర ప్రాంతాలకు తిప్పారు. పండుగలకు ముందు రెండు రోజులు, తర్వాత రెండు రోజులు ఆర్టీసీ బస్సులు జనాలతో కిక్కిరిసిపోయాయి. మహిళలు అధిక సంఖ్యలో ఉచిత బస్సు సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకున్నారు. దీంతో గడిచిన 15 రోజుల్లో ఆర్టీసీకి ఆదాయం పెరిగింది.

ఆదరించిన ప్రయాణికులు

జిల్లాలోని భద్రాచలం డిపో నుంచి 140 సర్వీసులు, కొత్తగూడెం డిపో నుంచి 61 బస్సులు, మణుగూరు 48, ఇల్లెందు నుంచి 25 సర్వీసులను పండుగ సందర్భంగా ప్రత్యేకంగా నడిపారు. దీంతో నాలుగు డిపోల పరిధిలో ప్రత్యేక సర్వీసుల ద్వారా రూ.10.49 కోట్ల మేర ఆదాయం వచ్చింది. భద్రాచలం డిపోకు అత్యధికంగా రూ.4.19 కోట్లు, మణుగూరు డిపోకు రూ.3.18 కోట్లు, కొత్తగూడేనికి రూ.2.47 కోట్లు, ఇల్లెందుకు రూ.65.52 లక్షల ఆదాయం సమకూరింది. పండుగల వేళ అధికారులు ప్రణాళిక ప్రకారం సర్వీసులు నడపడంతో ఆదాయం పెరిగింది. సిబ్బందికి ప్రత్యేక డ్యూటీలు వేయటంతోపాటు విధుల్లో ఉన్న సిబ్బందికి ఈసారి భోజనాలు కూడా ఏర్పాటు చేశారు. ఆర్టీసీ, డ్రైవర్లు, ఇతర సిబ్బంది కూడా సమష్టిగా సేవలేందించడంతో ప్రయాణికులు ఆదరించారు. ఆదాయం పెరగడంతో సిబ్బందిలో జోష్ కనిపిస్తోంది.

జిల్లాలోని నాలుగు డిపోల పరిధిలో వచ్చిన దసరా ఆదాయం

డిపో	కిలోమీటర్లు (లక్షల్లో)	ఆదాయం (రూ.లక్షల్లో)	ఓఆర్ శాతం
భద్రాచలం	7.19	419.18	88.00
కొత్తగూడెం	3.87	247.53	99.75
మణుగూరు	5.25	318.83	94.15
ఇల్లందు	1.27	65.52	93.00

అందరి సహకారంతోనే..



విజయదశమి పండుగ సందర్భంగా హైదరాబాద్‌తోపాటు వివిధ ప్రాంతాలకు ప్రత్యేక బస్సులను నడిపాం. రద్దీని బట్టి సర్వీసులు ఏర్పాటు చేశాం. ఈ సారి దసరా పండుగ రద్దీ అన్ని ప్రాంతాల్లోనూ కనిపించింది. ప్రయాణికులు ఎక్కువ సంఖ్యలో ఆర్టీసీని ఆదరించారు. సంస్థకు కూడా అధిక ఆదాయం వచ్చింది. ఇది అందరి సమష్టి సహకారంతోనే సాధ్యమైంది.
– దేవేందర్‌గౌడ్, డీఎం, కొత్తగూడెం

ఏదీ ఆనాటి కళ..?




పార్క్ ప్రారంభించిన కొత్తలో... (ఇన్‌సెట్) ప్రస్తుతం కళ కోల్పోయిన చిహ్నం

రఘునాథపాలెం మండలం జింకలతండా క్రాస్ వద్ద గతంలో సుడా ఆధ్వర్యాన పార్క్ ఏర్పాటు చేశారు. ఆ సమయంలో సుడా ఆధ్వర్యాన నిర్వహణ ఉండటంతో పచ్చటి మొక్కలు, ఆడుకునే వస్తువులతో సందర్శకులను ఆకట్టుకుంది. ప్రస్తుతం సుడా పాలకవర్గం లేకపోవడం, గ్రామ పంచాయతీలో సిబ్బంది కొరతతో ఆలనాపాలన చూసే వారు కరువయ్యారు. ఫలితంగా పార్క్ ఆవరణలో పిచ్చి మొక్కలు పెరగడమే కాక.. బొమ్మలు కళావిహీనంగా మారాయి. –స్టాఫ్ ఫొటోగ్రాఫర్

రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలు

రహదారిపై గుంతలో పడటంతో ఘటన


క్షతగాత్రుడిని 108లోకి చేరుస్తున్న సిబ్బంది

కొణిజర్ల: జాతీయ రహదారిపై గుంతల్లో వాహనం దిగబడటంతో ఓ యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. ఎస్‌ఐ జి.సూరజ్ కథనం ప్రకారం.. తనికెళ్లకు చెందిన సుతారీ చల్లా శివకుమార్ వైరాలో పనికి బుధవారం ఉదయం బైక్‌పై బయలుదేరాడు. కొణిజర్ల పోలీస్‌స్టేషన్ దాటాక ఎస్‌ఎస్‌పీ కాల్వ సమీపాన రోడ్డుపై గుంతలు ఉండటంతో అందులో బైక్ దిగపడగా శివ వాహనంపై నుంచి ఎగిరి కింద పడ్డాడు. ఈ ఘటనలో ఆయన తలకు తీవ్రగాయాలు కాగా వాహనదారులు ఇచ్చిన సమాచారంతో ఎస్‌ఐ చేరుకుని 108లో ఖమ్మం తరలించారు. అయితే, శివ పరిస్థితి విషమంగా ఉండటంతో హైదరాబాద్ తరలించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. రహదారిపై పలుచోట్ల గుంతలు ఏర్పడటంతో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నా అధికారులు, ప్రజా ప్రతినిధులు పట్టించుకోకపోవడంపై వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

రెండు ఆలయాల్లో చోరీ

మణుగూరు టౌన్: మున్సిపాలిటీ పరిధిలోని రెండు ఆలయాల్లో రెండు రోజుల వ్యవధిలో చోరీలు జరిగాయి. పోలీసుల కథనం ప్రకారం.. ఈ నెల 14న లారీ కాంటా వద్ద ఉన్న కనకదుర్గ ఆలయంలో దుండగులు చొరబడి హుండీ పగులగొట్టి కానుకలను చోరీ చేశారు. సుమారు రూ.25 వేల నగదు అపహరించినట్లు పూజారి పవన్ ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ మేడ ప్రసాద్ బుధవారం కేసు నమోదు చేశారు. శేషగిరినగర్‌లోని అభయాంజనేయ స్వామి ఆలయంలో మంగళవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ఆలయ ద్వారం తాళాలు, హుండీ పగులగొట్టి నగదు అపహరించారు. సుమారు రూ.5వేలు చోరీ చేసినట్లు ఆలయ నిర్వాహకులు వేముల లక్ష్మయ్య ఫిర్యాదు చేయగా, ఎస్‌ఐ రంజిత్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పంచదార లోడ్ లారీ బోల్తా


రహదారిపై పడిపోయిన పంచదార బస్తాలు

అశ్వారావుపేటరూరల్: పంచదార బస్తాల లోడ్‌తో వెళ్తున్న ఓ లారీ అదుపుతప్పి బోల్తా పడిన ఘటన బుధవారం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. కర్ణాటక రాష్ట్రం గుల్బర్గా నుంచి భువనేశ్వర్‌కు పంచదార లోడుతో వెళ్తున్న లారీ అశ్వారావుపేట మండలం నారంవారిగూడెం సమీపంలో అదుపుతప్పి బోల్తా పడింది. అదే సమయంలో లారీ పక్కన నుంచి వెళ్తున్న రెండు ద్విచక్రవాహనాలపై పంచదార బస్తాలు పడటంతో వాహనదారులు ప్రమాదానికి గురయ్యారు. ఇద్దరు వాహనదారులపై పడిన బస్తాలను స్థానికులు తొలగించి రక్షించారు. బస్తాలన్నీ జాతీయ రహదారిపై చెల్లాచెదురుగా పడిపోవడంతో సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకొని తొలగించారు. కాగా, ఈ ప్రమాదంలో డ్రైవర్, క్లీనర్‌తోపాటు, ఇద్దరు వాహనదారులు సురక్షితంగా బయటపడ్డారు.

యువకుడు ఆత్మహత్య

సత్తుపల్లిరూరల్: భార్య కాపురానికి రావడం లేదనే మనస్తాపంతో ఓ యువకుడు పురుగులమందు సేవించి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మండలంలోని తురకలగూడెం గ్రామానికి చెందిన పి.పవన్ (27) బుధవారం తెల్లవారుజామున పురుగులమందు తాగగా కుటుంబ సభ్యులు 108లో సత్తుపల్లి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అయితే, ఆయన అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. కాగా, పవన్ ఐదేళ్ల కిందట కిష్టారానికి చెందిన గోపికృష్ణను ప్రేమవివాహం చేసుకున్నాడు. వీరికి ఇద్దరు పిల్లలు జన్మించగా, కొద్దిరోజులుగా భార్య గోపికృష్ణ పుట్టింట్లో ఉంటోంది. దీంతోనే ఆయన మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకున్నట్లు కుటుంబీకులు చెబుతున్నారు. ఘటనపై సత్తుపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

టూరిజం హోటల్ ఎదుట మృతదేహంతో ఆందోళన


మృతదేహంతో ధర్నా చేస్తున్న కుటుంబ సభ్యులు

భద్రాచలంఅర్బన్: పట్టణంలోని తెలంగాణ టూరిజం శాఖ హోటల్ ఎదుట బుధవారం మృతదేహంతో కుటుంబీకులు, బంధువులు ఆందోళన చేపట్టారు. మృతుడి కుటుంబీకులు, బంధువుల కథనం ప్రకారం.. పట్టణంలోని అశోక్‌నగర్ కాలనీకి చెందిన ఇసంపల్లి నరసింహారావు (40) తెలంగాణ టూరిజం శాఖ హోటల్‌లో 12 ఏళ్ల నుంచి రోజువారీ వర్కర్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. మూడు నెలల క్రితం హోటల్ మేనేజర్ అకారణంగా విధుల నుంచి తొలగించారని ఆవేదన చెందుతున్నాడు. ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు తెలిపినా ఫలితం లేదు. దీంతో నరసింహారావు మనోవేదనకు గురై బుధవారం గుండె నొప్పితో మృతి చెందాడు. మృతుడికి భార్య లలిత, కుమార్తె ఉన్నారు. కాగా హోటల్ యాజమాన్యం తీరువల్లే మృతి చెందాడని, తమ కుటుంబానికి న్యాయం చేయాలని కోరుతూ తెలంగాణ టూరిజం శాఖ హోటల్ వద్ద మృతదేహంతో కుటుంబీకులు ధర్నా చేశారు. పలువురు కుల సంఘాల నాయకులు కూడా ఆందోళనకు మద్దతు పలికారు. సీఐ సంజీవరావు, ఎస్‌ఐ విజయలక్ష్మి అక్కడికి చేరుకుని బాధితులకు నచ్చజెప్పారు. మృతుడి భార్యకు టూరిజం శాఖలో ఉద్యోగంతోపాటు నరసింహారావు దహనసంస్కారాలకు ఖర్చులు ఇచ్చేందుకు టూరిజం శాఖ అధికారులు హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు టూరిజం హోటల్ మేనేజర్ నాగలక్ష్మిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

హోంవర్క్ చేయలేదని..

విద్యార్థిని చితకబాదిన ఉపాధ్యాయుడు

కొత్తగూడెంఅర్బన్: దసరా సెలవుల్లో ఇచ్చిన హోంవర్క్ సరిగ్గా చేయలేదనే కారణంతో విద్యార్థిని ప్రైవేటు పాఠశాల ఉపాధ్యాయుడు చితకబాదాడు. ఆగ్రహించిన తల్లిదండ్రులు, బంధువులు పాఠశాలలో ఆందోళన చేసి పోలీసులకు ఫిర్యాదు చేశారు. తల్లిదండ్రుల కథనం ప్రకారం.. హోంవర్క్ పూర్తిగా చేయలేదనే కారణంతో పట్టణ పరిధిలోని ప్రగతినగర్ ఏరియాలో ఉన్న మానస వికాస ప్రైవేటు పాఠశాలలో 6వ తరగతి విద్యార్థిని ఉపాధ్యాయుడు చితకబాదాడు. వీపుపై వాతలు పడే విధంగా కొట్టాడు. దీంతో విద్యార్థి ఇంటికి వెళ్లి చెప్పగా తల్లిదండ్రులు, బంధువులు బుధవారం పాఠశాలకు చేరుకుని ఆందోళన చేశారు. పాఠశాల యాజమాన్యాన్ని నిలదీశారు. అనంతరం త్రీటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో త్రీటౌన్ పోలీసులు వచ్చి ఉపాధ్యాయుడిని అదుపులోకి తీసుకున్నారు. ఈ సంఘటనపై త్రీటౌన్ సీఐ శివప్రసాద్‌ను వివరణ కోరగా ఉపాధ్యాయుడిని విచారిస్తున్నామని, కేసు కాలేదని తెలిపారు.

144 కేజీల బెల్లం స్వాధీనం

టేకులపల్లి: పరిమితికి మించి ఉన్న బెల్లం నిల్వలను ఎక్సైజ్, జిల్లా టాస్క్‌ఫోర్స్ అధికారులు బుధవారం పట్టుకున్నారు. అధికారుల కథనం ప్రకారం.. విశ్వసనీయ సమాచారంతో మండల కేంద్రంలోని ఓ కిరాణ దుకాణంలో సోదాలు నిర్వహించారు. దుకాణ యజమాని నివాసంలోనూ తనిఖీ చేయగా, 8 బెల్లం బాక్సులు లభించాయి. నిబంధనల ప్రకారం స్థాయిని బట్టి ఒక్కో కిరాణం షాపులో సుమారు 3, 4 బెల్లం బాక్సులు మాత్రమే విక్రయానికి ఉండాలి. ఒక్కో బాక్సులో 18 కేజీల బెల్లం ఉంటుంది. కానీ ఇక్కడ పరిమితికి మించి 8 బాక్సులు(144 కేజీలు) బెల్లం నిల్వ ఉంది. దీంతో కేసు నమోదు చేసినట్లు టాస్క్‌ఫోర్స్ ఎస్‌ఐ గౌతమ్ తెలిపారు.

గంజాయి స్వాధీనం


వివరాలు వెల్లడిస్తున్న అధికారులు

కొత్తగూడెంరూరల్: లక్ష్మీదేవిపల్లి మండలం లోతువాగు వద్ద బుధవారం చేపట్టిన వాహన తనిఖీల్లో ఖమ్మం ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఐదు కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఒడిశాలోని మల్కన్‌గిరి నుంచి హైదరాబాద్‌కు తరలిస్తుండగా ముగ్గురు నిందితులు ముద్దా కిషోర్, కరుణ్‌రాం బాబు, కరణ్ ఎర్రయ్యలను అరెస్ట్ చేసినట్లు సీఐ శ్రీనివాస్ తెలిపారు. మూడు సెల్ ఫోన్లు, ద్విచక్రవాహనం స్వాధీనం చేసుకున్నారు. ఈ తనిఖీల్లో హెడ్ కానిస్టేబుల్ కరీం, బాలు, కానిస్టేబుల్స్ సుధీర్, వెంకట్, హనుమంతరావు, హరీష్, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

డయాలసిస్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు


ప్రభుత్వాస్పత్రిలో డయాలసిస్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కూనంనేని

పాల్వంచ: పాల్వంచ ప్రభుత్వ ఆస్పత్రిలో అందుబాటులోకి వచ్చిన డయాలసిస్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు సూచించారు. బుధవారం స్థానిక ప్రభుత్వాస్పత్రిలో నూతనంగా ఏర్పాటు చేసిన డయాలసిస్ కేంద్రాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఐదు యూనిట్లను అందుబాటులోకి తీసుకొచ్చామని, సుమారు 40 మంది కిడ్నీ బాధితులకు వైద్యం అందించవచ్చని తెలిపారు. రూ.79 లక్షలతో ఆస్పత్రి ఆధునికీకరణకు ప్రతిపాదనలు చేశామని, అనుమతులు రాగానే పనులు ప్రారంభిస్తామన్నారు. కార్యక్రమంలో డీసీహెచ్‌ఎస్ డాక్టర్ రవిబాబు, తహసీల్దార్ వివేక్, మున్సిపల్ కమిషనర్ డాకూ నాయక్, ఎంపీడీఓ విజయ్ భాస్కర్ రెడ్డి, ఇన్‌చార్జ్ డీఎంహెచ్‌ఓ సుకృత, ఆర్‌ఎంఓ సోమరాజుదొర, డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు, సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె.సాబీర్ పాషా, డాక్టర సూర్యదేవర రామ్మోహన్ రావు, టీపీసీసీ సభ్యులు నాగా సీతారాములు, సీపీఐ నాయకులు నరాటి ప్రసాద్, పట్టణ కార్యదర్శి అడుసుమిల్లి సాయిబాబా, వీసంశెట్టి పూర్ణచందర్ రావు, బండి నాగేశ్వరరావు, రాహుల్ పాల్గొన్నారు.

నిర్వాసిత ప్రాంతంపై స్పష్టతనివ్వాలి


నిరసన తెలుపుతున్న కుమ్మరిబస్తీ వాసులు

ఇల్లెందురూరల్: నిర్వాసిత ప్రాంతంపై స్పష్టతనివ్వాలని మండలంలోని తిలక్‌నగర్ గ్రామపంచాయతీ కుమ్మరిబస్తీ ప్రాంతంలో చేపడుతున్న నేల చదును పనులను బుధవారం స్థానికులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా స్థానికులు మాట్లాడుతూ సింగరేణి ఇల్లెందు ఏరియా యాజమాన్యం గతంలో పనులు చేపట్టినప్పుడు కూడా అడ్డుకున్నామని తెలిపారు. జేకే ఓసీ కుమ్మరిబస్తీ సమీపంలో ఉంటుందని, గతంలో ఇదే ప్రాంతంలో 20 పిట్ భూగర్భ గని ద్వారా బొగ్గు తవ్వకాలు జరిగాయని, ఆ సమయంలో విషవాయువులు వెలువడటంతో బొగ్గు తవ్వకాలు నిలిపివేశారని చెప్పారు. నేటికీ పలుచోట్ల విషవాయువులు బయటకు రావడంతో మూగజీవాలు మృత్యువాత పడుతున్నాయని అన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో తమ ప్రాంతాన్ని నిర్వాసిత జాబితాలో చేర్చకుండా అన్యాయం చేయాలని చూస్తున్నారని వాపోయారు. సింగరేణి యాజమాన్యం స్పందించి తమ డిమాండ్లను పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ధనసరి రాజు, పోతురెడ్డి సారంగపాణి, సింగారపు శ్రీను, సింగారపు హరీష్, అవినాష్, మహేష్, ఎల్లాబాయి, తులసి, మున్ని, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

కన్నకొడుకును హత్య చేసిన తండ్రి

మద్యం మత్తులో వేధిస్తుండటంతో ఆగ్రహం


గణేశ్ (ఫైల్)

ఖమ్మంఅర్బన్: నిత్యం మద్యం సేవించి వస్తూ వృద్ధులైన తల్లిదండ్రులనే కాక సోదరుడిని వేధిస్తుండటంతో భరించలేక ఆ కొడుకును తండ్రి హత్య చేశాడు. ఖమ్మం రామన్నపేట కాలనీలో మంగళవారం అర్ధరాత్రి ఈ ఘటన జరిగింది. సీఐ భానుప్రకాష్ కతనం మేరకు.. కారుడ్రైవర్‌గా పనిచేస్తున్న కొంపెల్లి గణేశ్ (30)కు ఐదేళ్ల కిందట వివాహమైంది. ఆ తర్వాత దంపతులు విడాకులు తీసుకున్నారు. కొన్నాళ్లుగా గణేశ్ తాగుడికి బానిసై తల్లిదండ్రులను ఇబ్బంది పెడుతున్నాడు. వీరితో పాటు సోదరుడు ఎంత చెప్పినా వినకపోగా మంగళవారం రాత్రి కూడా మద్యం మత్తులో వచ్చిన గణేశ్ తన తండ్రి వెంకటేశ్వర్లుతో ఘర్షణ పడి దాడి చేశాడు. దీంతో ఆగ్రహించిన వెంకటేశ్వర్లు అందరూ నిద్రించాక గణేశ్ తలపై పదునైన ఆయుధంతో దాడి చేయడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటనపై మృతుడి సోదరుడు నాగేంద్రబాబు ఇచ్చిన ఫిర్యాదుపై పోలీసులు కేసు నమోదు చేయగా, నగర ఏసీపీ రమణమూర్తి ఘటనాస్థలాన్ని పరిశీలించారు.

పాదచారులపైకి దూసుకెళ్లిన కారు

ఎనిమిది మందికి తీవ్ర గాయాలు


ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

కల్లూరురూరల్: మండలంలోని పేరువంచలో బుధవారం రాత్రి ఓ కారు పాదచారులపైకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో ఎనిమిది మంది తీవ్రంగా గాయపడ్డారు. కారుడ్రైవర్ అజాగ్రత్తగా, వేగంగా నడపడంతోనే ఈ ప్రమాదం జరిగిందని తెలుస్తోంది. క్షతగాత్రుల్లో ఆరుగురు పురుషులు, ఇద్దరు మహిళలు ఉన్నారు. వీరిని కల్లూరు ప్రభుత్వాస్పత్రికి తరలించి చికిత్స చేయిస్తున్నారు. గాయపడిన వారిలో మంచాల చిన్న నర్సయ్య, మంచాల నర్సమ్మ పరిస్థితి విషమించడంతో ఖమ్మం తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు ఆరా తీశారు.

ముగిసిన కోటమైసమ్మ జాతర


జాతర ప్రాంగణంలో భక్తుల రద్దీ

కారేపల్లి: మండలంలోని ఉసిరికాయలపల్లిలో కొలువైన శ్రీ కోట మైసమ్మ తల్లి జాతర ముగిసింది. దసరా రోజున మొదలైన జాతర ఐదో రోజైన బుధవారం ముగియగా వేలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. దేవాదాయ ధర్మాదాయశాఖ, పర్సా ట్రస్టు ఆధ్వర్యాన భక్తులు ఇబ్బంది పడకుండా ఏర్పాట్లు చేయడంతో ఎలాంటి ఆటంకాలు ఎదురుకాలేదు. ఇక జాతర ప్రాంగణంలో జాయింట్ వీల్స్, సర్కస్ తదితర ఏర్పాట్లు ఉండటంతో భక్తజనం పిల్లాపాపలతో సందడిగా గడిపి తిరుగుముఖం పట్టారు. జాతర సందర్భంగా భక్తులు హుండీల్లో సమర్పించిన కానుకలను గురువారం లెక్కిస్తామని ఈఓ వేణుగోపాలాచార్యులు తెలిపారు.

సాక్షి క్లాసిఫైడ్స్



■ ఖమ్మంలోని ప్రముఖ సంస్థలో పని చేయుటకు సెక్యూరిటీ గార్డ్స్ & సూపర్ వైజర్స్ వెంటనే కావలెను. జీతం 12-14 వేలు. సంప్ర।। 9550546787, 8500915250. [M-1185483]

■ ప్రముఖ కంపెనీలో వర్క్ చేయుటకు స్త్రీ, పురుషులు కావలెను. Qul: 10th - డిగ్రీ, Sal: 20K - 30 K మీ అడ్రస్ వాట్సప్ చేయగలరు. వర్క్ ఫ్రం హోం అవకాశం కలదు. 8121818692 [M-1185480]

■ త్రివేణి హోంకేర్‌లో వృద్ధులను, పేషెంట్లను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీ వసతి, భోజనం జీ : 18K. Ph: 9160900024 [SCA24000401]

■ నూతనంగా ప్రారంభించబడిన VSR ఎంటర్‌ప్రైజెస్ నందు పనిచేయుటకు సూపర్‌వైజర్స్, ఎగ్జిక్యూటివ్ ఫీల్డ్ ఆఫీసర్స్, లేడీ టెలికాలర్స్, ITI All Trades వెంటనే కావలెను. రూం+భోజనం ఫ్రీ. జీతం: 15,000 నుండి 25,000. ఫోన్: 88866 60569. [V-823870]

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ప్రకటన గోరంత! స్పందన కొండంత!!
సాక్షి క్లాసిఫైడ్స్
ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు మా ప్రతినిధులను సంప్రదించండి
వివరాలకు :
ఖమ్మం : 9705444182, 9010299957
కొత్తగూడెం : 9010223783